క్లుప్తంగా

పంజేషాలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ

చార్మినార్: పత్తర్‌గట్టి మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం పంజేషాలో జరిగిన ఇఫ్తార్ విందులో మజ్లిస్ పార్టీ ఫ్లోర్ లీడర్, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు. ఆయనతో పాటు చార్మినార్, మలక్‌పేట్ ఎమ్మెల్యేలు ముంతాజ్ అహ్మద్ ఖాన్, అహ్మద్ బలాల, ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ హఫందీ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌కు సన్మానం



రవి కిరణ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: చుడిబజార్ హరిజన్ సేవక్ మండలి కార్యాలయం పై అంతస్తు నిర్మాణం పనులు వేగవంతంగా చేపడుతామని జోనల్ జీహెచ్ఎంసీ కమిషనర్ రవికిరణ్ పేర్కొన్నారు. నిర్మాణ పనులకు రూ.40 లక్షల నిధుల టెండర్ ప్రాసెస్‌లో ఉండడంతో జోనల్ కమిషనర్‌ను బీఆర్ఎస్ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పనులు వేగంగా చేపట్టేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. మంత్రి సహకారంతో నిర్మాణ పనులు త్వరలోనే పూర్తవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, ధర్మేందర్, దేవేందర్, వెంకటేష్, కిశోర్, రాజు, బాలరాజ్, రజని, వెంకటేష్ పాల్గొన్నారు.

భవిష్యత్తు డిజిటల్ రంగానిదే: అల్లం నారాయణ



కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

గోల్కొండ: మీడియా రంగంలో ముందుకు సాగాలనడానికి చురుకుదనంతో పాటు విషయాన్ని సునిశితంగా అర్థం చేసుకోవడం ముఖ్యమని తెలంగాణ రాష్ట్ర మీడియా చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. బుధవారం మెహిదీపట్నంలోని సెయింటాన్స్ మహిళా కళాశాల జర్నలిజం డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆపర్చునిటీస్ అండ్ చాలెంజెస్ ఫర్ జర్నలిస్ట్ డ్యూరింగ్ ద డిజిటల్ ఎరా అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. మీడియా భవిష్యత్తులో డిజిటల్ వశం కాబోతుందని ఆయన అన్నారు. ఏపీ కాలేజ్ ఫౌండర్ సతీష్ రెడ్డి, టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటర్ సుధాకర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

గోవులను కాపాడిన గో రక్షాదళ్ సభ్యులు

అబిడ్స్: గోవులను అక్రమంగా గో వధ శాలలకు తరలిస్తుండగా గో రక్షాదళ్, ధ్యాన్ ఫౌండేషన్, టీటీడీ గో సంరక్షణా సభ్యులు కాపాడారు. ఐదు రోజులుగా రేయింబవళ్లు కష్టపడుతూ తొమ్మిది వాహనాలలో అక్రమంగా గోవధశాలలకు తరలిస్తున్న 334 గోవులను రక్షించారు. నగర శివారులతో పాటు బీబీనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో రాత్రివేళ కాపుకాసి స్థానిక పోలీసుల సహకారాలతో గోవులను కాపాడారు. ఈ కార్యక్రమంలో టీటీడీ గోరక్షాదళ్ సభ్యులు కోటి శ్రీధర్, గో రక్షాదళ్ రాష్ట్ర అధ్యక్షులు కాలూసింగ్, గోరక్షాదళ్ టైగర్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు దీపక్ సింగ్, ఇతర నాయకులు నితేష్, మైనేష్ కేథార్ సింగ్, శంకర్ యాదవ్, బొట్టు పవన్, వివేక్ సింగ్, సంజయ్, నర్సింగ్, సోనూసింగ్, చందు, తరుణ్‌సింగ్‌లు పాల్గొన్నారు. కాపాడిన గోవులను జియాగూడ గోశాలతో పాటు ఇతర గోశాలలకు తరలించారు.

సీతారాముల కల్యాణం చూద్దాం రండి!

- శ్రీరామ నవమికి సర్వం సిద్ధం
- ముస్తాబైన ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాల నిర్వాహకులు

జియాగూడ: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని పలు రామాలయాలు, పలు హనుమాన్ దేవాలయాలు కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. చారిత్రాత్మకమైన సీతారామ్‌బాగ్ రామాలయం ఎంతో ఖ్యాతి గడించింది. అలాగే జియాగూడ, మంగళ్‌హాట్, రహింపురా, కుమ్మరివాడి, కార్వాన్‌లోని పలు ప్రాంతాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు పూర్తి చేశారు.

ధూల్‌పేట్‌లో సందడి..

సీతారామ కల్యాణ మహోత్స విగ్రహాలు ధూల్‌పేట్‌లో జోరుగా విక్రయాలు జరుగుతున్నాయి. ధూల్‌పేట్ కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకున్న సీతారామచంద్ర లక్ష్మణ విగ్రహాలు రెండు నుంచి 5 ఫీట్ల ఎత్తులో తయారై అందుబాటులో ఉన్నాయి. ఈ విగ్రహాల జతలు రూ.11 వేలు, రూ.21 వేలు ధర పలుకుతున్నాయి. ధూల్‌పేట కళాకారుల చేతుల్లో ఎంతో కళాత్మకంగా రూపుదిద్దుకునే విగ్రహాలను ఎంతో ఉత్సాహంగా భక్తిశ్రద్ధలతో సంఘాలు, దేవాలయాల ప్రతినిధులు కొనుగోలు చేస్తున్నారు.



ధూల్‌పేట్‌లో విగ్రహాల విక్రయాలు

జియాగూడలో..

జియాగూడలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయం, కురుమ బస్తీలోని శ్రీ రంగనాథ కల్చరల్ అసోసియేషన్, జియాగూడ ఆరెకటిక సంఘం, సమర్థ నారాయణ ఆశ్రమం, శివ్‌బాగ్‌లోని శివరామాలయం, ముస్తయిద్‌పురాలోని షిరిడీ సాయిబాబా దేవాలయంలో శ్రీరామ భక్త సమాజం ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాలు జరుగనున్నాయి.

సీతారామ్‌బాగ్ టెంపుల్‌లో..

సీతారామ్‌బాగ్ టెంపుల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా ప్రారంభమవుతున్నాయి. రాజస్థాన్ రుక్మ న్‌గడ్ ప్రాంతానికి చెందిన సేట్ పురన్‌వల్ గనేరివాలా 25 ఎకరాల్లో 1832లో ఆలయం నిర్మించి మూల విరాట్‌లను ప్రతిష్ఠించారు. నాటి నుంచి సీతారామ్‌బాగ్ టెంపుల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరుగుతున్న కల్యాణమహోత్సవం అనంతరం శ్రీరామనవి శోభాయాత్ర ఇక్కడి నుండే ప్రారంభం అవుతుంది.



సీతారామ్‌బాగ్ టెంపుల్

శ్రీరామ నవమి శోభాయాత్రకు భారీ ఏర్పాట్లు

అబిడ్స్: శ్రీరామ నవమి శోభాయాత్రకు భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. గురువారం శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహించనున్నారు. సీతారామ్‌బాగ్ ఆలయం నుంచి భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంటకు శోభాయాత్ర ప్రారంభం కానుంది. మరో శోభాయాత్ర ధూల్‌పేట గంగాబౌలి ఆకాష్‌పురి హనుమాన్ ఆలయం నుంచి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో ప్రారంభమవుతుంది. అదేవిధంగా అప్పర్ ధూల్‌పేట్ నుంచి బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌సింగ్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి పాల్కియాత్ర మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమవుతుందని. ఈ పాల్కియాత్రను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభిస్తారు. 3 యాత్రలు ధూల్‌పేట ప్రధాన రోడ్డుమీదుగా జాలీ హనుమాన్, పురానాపూల్, జుమ్మెరాత్‌బజార్, చుడిబజార్, బేగంబజార్‌ఛత్రి, సిద్ధిఅంబర్‌బజార్, గౌలిగూడ నుంచి కోఠి హనుమాన్ వరకు శోభాయాత్ర ఉంటుంది.



శోభాయాత్ర కోసం శ్రీరాముడి భారీ విగ్రహం

దాదాపు 5 లక్షల మంది భక్తులు..

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా దాదాపు 5 లక్షల మంది రామభక్తులు శోభాయాత్రలో పాల్గొంటారని నిర్వాహకులు భావిస్తున్నారు. పలు ప్రాంతాల్లో స్వాగత వేదికలు ఏర్పాటు చేసి అల్పాహారాలు, చల్లటి పానియాలు అందించనున్నారు. సౌత్ వెస్ట్ డీసీపీ కిరణ్ ఖారె ఆధ్వర్యంలో భారీ బందోబస్తుకు సన్నాహాలు చేస్తున్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నాంపల్లి: హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో మెనూ ప్రకారం భోజనం అందించాలని సంక్షేమ హాస్టళ్ల సమస్యల సాధన సమితి, కుల నిర్మూలన వేదిక ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ యాదయ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. సంక్షేమ హాస్టళ్లలో తాగునీరు, పౌష్టికాహారం, మరుగుదొడ్ల నిర్వహణ వంటి కనీస సదుపాయాలు లేవని, మెహిదీపట్నం, చింతలబస్తీ, ఎస్సీ సంక్షేమ హాస్టళ్లలో తాగునీరు అందడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంక్షేమ శాఖ జిల్లా అధికారులు వసతి గృహాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పనుల్లో నిర్లక్ష్యం పనికిరాదు: ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పనుల్లో నిర్లక్ష్యం పనికిరాదని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన జలమండలి ప్రాజెక్ట్ టీం ప్రతినిధులతో టోలిచౌకి మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్వాన్‌లోని అన్ని డివిజన్లలో భారీ ఎత్తున పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. అయితే కొన్ని చోట్ల ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. దీనివల్ల స్థానిక ప్రజలే కాకుండా ఆ పనులు జరుగుతున్న పరిసర ప్రాంతాల్లోని బస్తీల వాసులు ఇబ్బందిపడుతున్నారన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయిస్తే పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు వాహనదారులకు కూడా ఇబ్బందులు తప్పుతాయన్నారు. జలమండలి ప్రాజెక్ట్ ప్రతినిధులతో పాటు మజ్లిస్ సీనియర్ నాయకులు హారూన్ ఫరాస్ తదితరులున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

హ్యాండ్లూమ్ పేరిట జరుగుతున్న మోసాలను అరికట్టాలి

నాంపల్లి: రాష్ట్రంలో నకిలీ చేనేత వస్త్రాలు విక్రయిస్తూ వేల కోట్ల రూపాయల దందా నిర్వహిస్తున్న అవినీతి వ్యాపార సంస్థలు, ఆయా సంస్థల యాజమాన్యాలపై అనేకమార్లు రాష్ట్ర చేనేత జౌళి శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో నేతన్నల దుర్భర పరిస్థితులను అరికట్టడానికి బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపకుడు దాసు సురేష్ ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కేంద్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ చేనేత జౌళి శాఖలకు నోటీసులు పంపించింది. ఈ నేపథ్యంలో బుధవారం తెలంగాణ హ్యాండ్లూమ్ కమిషనర్ బుద్ధ ప్రకాష్ జ్యోతితో దాసు సురేష్ భేటీ అయ్యారు. సుమారు గంటపాటు కొనసాగిన ఈ భేటీలో రాష్ట్రంలో కొనసాగుతున్న చేనేత అవినీతి దందాను దాసు సురేష్ కమిషనర్ బుద్ధ ప్రకాష్‌కు వివరించారు. రాష్ట్రంలోని అన్ని కార్పొరేట్ షాపింగ్ మాల్స్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెంటనే ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని కోరారు.

విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణులపై వేధింపులు సరికాదు



వినతిపత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సంఘం ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: కలప వృత్తిదారులైన విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణుల అటవీశాఖ అధికారుల వేధింపులను అరికట్టాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు బుధవారం అటవీశాఖ రాష్ట్ర ముఖ్య సంచాలకులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ.. నెల రోజులుగా ఖమ్మం జిల్లాలోని దూగోడ చేతివృత్తిదారులపై అటవీశాఖ అధికారులు ప్రతిరోజూ దాడులకు పాల్పడుతూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా చేతివృత్తి పనిని నమ్ముకున్న తమపై ఇటువంటి దాడులు సరికాదన్నారు. ఈ విషయాన్ని శాసనమండలి సభ్యులు మదుసుధనాచారి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తక్షణమే అటవీశాఖ అధికారులతో సంప్రదింపులు జరపడం ఎంతో సంతోషదాయకమన్నారు. అటవీశాఖ రాష్ట్ర చీఫ్ డైరెక్టర్ సూచనలను ఖమ్మం జిల్లా అధికారులు తక్షణమే అమలు చేసి విశ్వబ్రాహ్మణులపై దాడులను మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కైరూట్‌తో వీజేఐటీ ఒప్పందం

అబిడ్స్: విద్యార్థులకు ఉద్యోగాలు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించేందుకు స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థతో వీజేఐటీ కళాశాల ఒప్పందం కుదుర్చుకుందని ఆ కళాశాల డైరెక్టర్ సాయిబాబారెడ్డి, ప్రిన్సిపాల్ పద్మజ పేర్కొన్నారు. నగరంలోని స్కైరూట్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులతో తమ కళాశాల ఒప్పందం కుదుర్చుకుని విద్యార్థులకు అన్నివిధాల ఉద్యోగా అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థతో అంగీకార పత్రాలు మార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కో ఆర్డినేటర్ శ్రీలత, సీనియర్ అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ వెంకటాచలం, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాల అధిపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్, శాటిలైట్ వర్క్‌గ్రూప్ డైరెక్టర్ వసంత్ పాల్గొన్నారు.



స్కైరూట్ సంస్థ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్న సాయిబాబారెడ్డి, పద్మజ

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

గన్‌ఫౌండ్రీ: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని పలువురు ప్రతినిధులు అన్నారు. బుధవారం రవీంద్రభారతిలో ఇండియన్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగ్గా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో పవర్‌లిఫ్టింగ్ పోటీలను నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నగర క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. సైఫాబాద్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సీతారాములు, పవర్ లిఫ్టింగ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



సైఫాబాద్ డీఐకు జ్ఞాపికను అందజేస్తున్న ప్రేమ్‌కుమార్ తదితరులు

ముగిసిన జాతీయ సదస్సు

సుల్తాన్‌బజార్: ఆధునిక సంస్కరణలు విద్యలో చాలా మార్పులు తీసుకువచ్చాయని మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డాక్టర్ డబ్ల్యూజీ ప్రసన్న కుమార్ అన్నారు. తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయ బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కోఠిలోని టీఎంసీ ఆడిటోరియంలో ఆర్థిక సంస్కరణలు సవాళ్లతో కూడిన భారతదేశ రూపాంతరణ అనే జాతీయ సదస్సులు బుధవారం ముగిశాయి. తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం ఆర్థిక విభాగాధిపతి డాక్టర్ కేవీ రత్నకుమారి, బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విభాగాధిపతి డాక్టర్ మునుస్వామి ఈ సదస్సుకు కన్వీనర్‌లుగా వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా డబ్ల్యూజీ ప్రసన్నకుమార్ హాజరై ప్రసంగించారు. భారతదేశ ఆర్థిక సంస్కరణల గురించి మేధావుల అభిప్రాయాలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజ్జులత, వీసీఎన్ఆర్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ నారాయణ, శక్తి కుమార్, మహిళా విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరిజారాణి, వైస్ ప్రిన్సిపాల్ పీవీ గీతాలక్ష్మి, ప్రొఫెసర్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరుద్యోగ నిరసన దీక్ష

చార్మినార్: కోఠి జిల్లా కన్వీనర్ సభావత్ కల్యాణ్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కోఠి జిల్లాలోని గవర్నమెంట్ సిటీ కాలేజీ వద్ద టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై బుధవారం నిరుద్యోగ నిరసన దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ కల్యాణ్ మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ అయ్యి 18 రోజులు అవుతున్నా ఘటనపై ఇప్పటి వరకు ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించకపోవడాన్ని ఖండిస్తూ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యాలను వ్యతిరేకిస్తూ వెంటనే ముఖ్యమంత్రి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలన్నారు. నగర కార్యదరిశ నితిన్, కళాశాల అధ్యక్షుడు దిలీప్, రాష్ట్ర గరల్స్ కన్వీనర్ సిరివెన్నెల, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ రాహుల్, విఘ్నేష్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ సుభాష్, సురేంద్ర, నితిన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గోల్కొండ: హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా చలో కార్వాన్ హనుమాన్ జయంతి శోభాయాత్రను శోభాయమానంగా నిర్వహిస్తామని బీజేపీ సీనియర్ నాయకులు కట్ల అశోక్ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్‌లోని కేసరిహనుమాన్ ఆలయం వద్ద ఆలయ పూజారి సందీప్ మహారాజ్‌తో కలిసి హనుమాన్ జయంతి శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏప్రిల్ 6న ఈ శోభాయాత్ర కేసరి హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబటి శ్రీకాంత్, దినేష్, సందీప్, అంబటి అభిలాష్, మణికంఠ పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సందీప్ మహారాజ్, కట్ల అశోక్

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

చాంద్రాయణగుట్ట: పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ భోజ్యా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. లలితాబాగ్‌కు చెందిన గణేష్ కుమార్తె శ్రీజ(15) స్థానికంగా ఉన్న వాణి విద్యానికేతన్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శ్రీజ థైరాయిడ్ సమస్యతో బాధపడుతూ చదువుపై ఏకాగ్రత చూపలేకపోతుంది. ఈ క్రమంలోనే ఆమె రెండు నెలల నుంచి పాఠశాలకు కూడా వెళ్లడం లేదు. పరీక్షలు దగ్గర పడుతున్నా కుమార్తె పాఠశాలకు వెళ్లకపోవడం.. సరిగ్గా ప్రిపరేషన్ కూడా కాకపోవడం పట్ల తల్లిదండ్రులు ఆమెను మంగళవారం మందలించారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీజ అదేరోజు మధ్యాహ్నం తల్లి, సోదరీ బయటికి వెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వైభవంగా వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు



సీతమ్మకు మంగళస్నానం చేయిస్తున్న ముత్యాల శేఖర్‌బాబు, సుమలత, నీలావతి



రాములోరికి మంగళస్నానాల కార్యక్రమంలో రాహుల్ దాస్‌బాబాతో పాటు కృష్ణ, స్వప్నకుమారి తదితరులు



ఆలయంలో వేడుకలు

లంగర్‌హౌస్: నేడు సీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకొని లంగర్‌హౌస్ త్రివేణి సంగమంలో మంగళస్నానాలు, స్వామి వారు అమ్మవార్ల నూతన వధువరుల ముస్తాబు, వసంతోత్సవాలు కనుల పండుగగా జరిగాయి. పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో వేదపండితులు రాజనర్సింహచారి మంగళస్నానాలు నిర్వహించారు. సాయిటెక్ పెయింట్స్ అధినేత దివంగత సాయిటెక్ ముత్యాల కృష్ణ ఇంట్లో ముత్యాల శేఖర్‌బాబు, సుమలత, నీలావతి జానకి దేవికి పసుపు పెట్టి మంగళస్నాలు చేయించారు. మామిడాకుల కృష్ణ, స్వప్న కుమారి దంపతుల ఇంట్లో రాములోరికి మంగళస్నానం నిర్వహించారు. సంఘం ఆలయం నుంచి మోహిణి అలంకార రూపంలో దర్శనమిచ్చిన స్వామి వారిని లంగర్‌హౌస్ వీధుల్లో ఊరేగించారు.